# 22. కురూపులు

ప్రతి వ్యక్తికీ కురూపిగావుండే హక్కు వుంది; లీబూ ఆ హక్కును ఘోరంగా పోట్లాడి సంపాయించాడు. ఉన్నవాటిని, మరింతగా దిగతొక్కేందుకల్లే, అతని కఠినవిధిని 'లీబూ' అనే పేరుతోనే అతన్ని భూమిమీద వదిలింది. కాని, దయామయుడైన అతని తండ్రి, యీవిధి లిఖితాన్ని గమనించకుండానే, కొడుక్కు 'ఆంటోనియస్'"* అని పేరు పెట్టాడు.

సర్వసమానత్వానికి నడిపే బాటమీద కొంతదూరం, ప్రయాణం చెయ్యగలిగిన – ఇప్పటి కాలపువాళ్ళలో కూడా ఆంటోనియస్ లీబూ, తన వికృతాకారంవల్ల, గొప్పస్థానాన్ని ఆక్రమించుకున్నాడు; అంటే – మీరాబూ అనే అతన్నిచూసి, ప్రజలు 'అందమైన రాక్షసి' అనేవాళ్ళు; కాని యీ అందమైన రాక్షసంత ఘోరంగా లీబూ లేకపోయినా, మీరాబూకన్న లీబూనే ప్రజలు ఎక్కువగా ఏవగించుకునేవాళ్ళు.

పాపం....పాప మేమిటి?...ఏ విధమైన అందమూలేని కురూపత్వం అతని సొమ్ము, అతను కురూపి; అంతే! అంతకు మించిన ఎక్కువా లేదు; తక్కువా లేదు. ఒక్కమాటలో కురూపత్వంలోని కురూపి! అతనికి గూనీలేదు. కొంగ కాళ్లూ లేవు, బానంత పొట్టాలేదు, అంత పొట్టీకాదు – ఐనాకూడా ఆ శరీర నిర్మాణంలోని పొళ్ళు ఎక్కడా కలవలేదు. ఇది ఒక్క చిత్రకారుడి దృష్టికే కాదు; కళ్ళున్న ప్రతివాడికీ తెలిసిన నిజం. కొత్తవ్యక్తి లీబూను చూడగానే, 'ఏం వింతవస్తువ!' అనుకోక తప్పదు.

---

* *'ఆంటోనియస్' – గొప్ప అందగాడు అవటంవల్ల హెడ్రియస్ చక్రవర్తికి (క్రీ.పూ. 138-117) ప్రియస్నేహితుడయ్యాడు. చక్రవర్తిచూపే అంతులేని ఆ అనురాగాన్ని భరించలేకనో, ప్రమాదంవల్లనో – నైలునది గర్భంలో స్థిరనివాసాన్ని ఏర్పర్చుకున్నాడు.*

అతని వెంట్రుకల ఛాయను పేర్కొనేందుకు ప్రత్యేక పదమేమీ లేదు. దగ్గర దగ్గరగా, నీలంలో కలిసిన పసుపుపచ్చ, అవైనా ఎక్కువకూడా లేవు; అంటే పూర్తి బోడిగుండు కాదు; కాని పుర్రెమీది తెల్లని చర్మాన్ని కోరకుండానే ప్రజలందరకూ చూపేందుకు చాలినంత బోడి! ... ఆ చర్మం అచ్చ తెలుపనేందుకూ వీల్లేదు; బూడిదరంగు కలిసిన తెలుపు! అతని ముఖం బూడిదరంగుగా ఉండేది. అతని నోటినిగూర్చి ఎక్కువ చెప్పక్కర్లేదు; అదో చిన్న పొగ గొట్టాంలాంటిది.

–కాని, ఇంతవరకూ అతన్ని గూర్చి నేనేమీ అనలేదు. నేను చెప్పాల్సి వస్తే 'వర్ణనాతీతం' అనే మామూలు కవివాక్యాన్ని ఇంకోసారి రాయాల్సి వస్తుంది... కాని లీబూ కురూపి అనే మాటను మీరు మరువకండి; ఎందుకంటే, అతన్ని చూసిన ప్రతివాడూ అంతకన్న కురూపిని తనదివరకు చూడ లేదనుకునేవాడు.. అతని దురదృష్టానికి తోడుగా, తను నిజంగా కురూపేనని అతని దృఢ నమ్మకం.

ఇంతవరకూ చెప్పినదాన్నిబట్టి, అతను దుర్మార్గుడు కానీ, మూర్ఖుడు కానీ – కాడని మీరు గ్రహించే వుంటారు. సౌఖ్యంలేని వాడు ఎప్పుడూ తను బాధపడే విషయాన్ని గూర్చే తరిచి తరిచి ఆలోచిస్తూ వుంటాడు. అందుకనే ప్రజలు – సంతోషంలేని ఏ మంచితనమూ పైకిరాదన్నట్టూ – అతని టోపీని బఫ్ఫూన్ టోపీగా జమకట్టారు. దీనికి ఫలితంగా లీబూ ఒక మూర్ఖుడుగా వ్యవహరింపబడేవాడు. అతను కురూపి కనుక, అతనికెవ్వరూ జాలికూడా చూపేవాళ్ళు కాదు.

అతనికి జీవితంలో ఒక్కటే కోర్కెవుంది; అది, చీకటిసందుల్లో, చీకటి రాత్రుల్లో నడుస్తూండగా – విటులకోసం కాచుకు కూర్చున్న వేశ్యలు, "సుందరమైన నల్లవాడా – నాతో మా ఇంటికిరా..." అనటాన్ని చెవులారా వినటం!

కాని – పాపం! – ఇది నిజమైన ఆనందం కాదని అతనికి బాగా తెలుసు. ముసలిది కానీ, తాగివున్నదికానీ, ఒకవేళ మోసపోయినా – ఇంటి దగ్గర లాంతరు వెలిగించగానే, 'చక్కని – నల్లవాడా!' అని గొణుక్కునేది. అతన్ని చూడగానే ముసలిది, మరీ ముసలిదయ్యేది; తాగుబోతు చప్పున తెలివి తెచ్చుకునేది. ఎన్నో చేతుల్నిచూసి, పూర్తిగా విసుగుచెంది, అన్నివిధాల కీడులకూ సిద్ధపడ్డదైనా – ఎక్కువ డబ్బు తీసుకుంటూకూడా, "నేను నిజం చెప్పాలంటే నువ్వు అతి కురూపివి" అనకుండా, ఉండలేకపొయ్యేది. జీవితంలో పూర్తిగా చెడిబతికిన స్త్రీ కూడా, ఇంటికి ఆహ్వానించాక, లీబూను చూసి, "నేను బాగా ఆకలిగొని వున్నానేమో?" అనే దుఃఖమయ వాక్యం అవటంవల్ల – దుఃఖిస్తూ అనుభవించే యీ ఆనందం కూడా లీబుకు అందకుండా పొయ్యేది.

పాపం! – ఆ నిర్భాగ్యుడికే ఆకలి ఎక్కువ; ఆ 'ఆకలి' ప్రేమకు సమీపమైంది. తను కురూపయినంత మాత్రాన, అందరిచేతా ఏవగించుకో బడుతున్నా, దేశంనుంచి తరుమబడ్డట్టు – ఎడారి జీవితాన్ని గడపటం అతనికి ఏ మాత్రమూ ఇష్టంలేదు.

అందుకనే తను కురూపని ఆలోచించకుండా - కనీసం తనకా సంగతి చెప్పకుండా, తనను చూసి భయపడనట్టు ఉండే స్త్రీ - ఎంత కురూపయినా అతనికి అప్సరసతో సమానం -

ఒకనాడు అతనొక భిక్షకురాల్ని చూశాడు. కళలేని కళ్ళూ, గుంటలుపడి భయంకరంగా వున్న మొహమూ, వంకరనోరూ - ఆమె సొమ్ములు, చిరిగిన బట్టల్ని ధరించి, శుభ్రత అనేదేమీలేకుండా, ఆమె అడుక్కుంటూవుంటే, లీబూ ధర్మం చేశాడు. వెంటనే ఆమె కృతజ్ఞతా పూర్వకంగా, అతని చేతిని ముద్దుపెట్టుకుంది. దీనికి ఫలితంగా - లీబూ ఆమెను ఇంటికి తీసుకువెళ్ళి, శుభ్రతను నేర్పి మంచి బట్టలిచ్చి, తనకు దాసీగా నియమించుకున్నాడు; క్రమంగా ఆమెను ఉంపుడుగత్తెగానూ; తరువాత భార్యగానూ కూడా చేశాడు.

ఆమె దాదాపు లీబూ అంత కురూపే. 'దాదాపు' అంటే - సరిగ్గా అంతని కాదు; ఎందుకంటే ఆమెరూపు భయంకరంగావున్నా - ఆ భయంకరతే, నిస్సందేహంగా, ఒక విధమైన అందాన్ని ఆమెకు ఇస్తోందనే చెప్పాలి. ఆ 'అందం' ఆడది మగవాణ్ణి ఆకర్షించే జాతిదనే చెప్పాలి; దీన్ని రూపించేందుకు ఆమె లీబూను మోసం చేసింది; అతను చూసేట్టు ఇంకో పురుషుడి స్నేహాన్ని కూడా మరిగింది.

ఈ కొత్త విటుడు - నిజానికి లీబూకన్న కూడా కురూపే! బాహ్య రూపంలోని పొళ్ళు ఎంత వికృతంగా సర్దవచ్చో, ఇతన్ని చూస్తే అర్థమౌతుంది. ఇతను కూడా ఒక భిక్షకుడే, ప్రభుత్వం కట్టించిన జైళ్ళను చాలాసార్లు ఉపయోగించుకున్నాడు. మురికితనాన్ని దేశమంతటా తిప్పుతూ, పూర్వ మెప్పుడో యీమె స్నేహాన్ని సంపాయించుకో గలిగాడు....కొంగకాళ్ళూ, ఒక పక్కకు తిరిగిన నోరూ, ప్రేతకళబడ్డ మొహమూ, ఆ మొహంలోని ముక్కుకు మారుగా రెండు రంధ్రాలూ - అతని ఆకార విశేషాలు.

ఒకనాడు లీబూ ఆమెను నిలవదీసి అడిగాడు: "ఆ వెధవను ఉపయోగించి నన్ను మోసం చేస్తున్నావ్, మరీ అది, నా కళ్ళఎదుట నా ఇంట్లోనే చెయ్యటం మరీ ఘోరం. నీకు కళ్ళులేవూ - నాకన్న కురూపితో స్నేహంచేసేందుకు-?"

ఆమె అంది: "ఎబ్బే...కాదు...నువ్వు ఏమన్నా అను; నన్ను 'మురికిముండా' అను. కాని నీకన్న అతను కురూపి అనే మాటమాత్రం అనవోకు-"

ఆ చివరి మాటలు, ఆమె తలచనంతగా, లీబూను బాధించినయ్. అతను ఆశ్చర్యపడుతూ శిలా ప్రతిమలాగు నిలబడ్డాడు.

ఆమె మళ్ళీ అంది: "ఎందుకంటే - అతని కురూపత్వానికి ఒక ప్రత్యేకత వుంది. కాని నువ్వు లోకంలోని ఇతర కురూపుల్లో - ఒక సాదా కురూపివి!"